క్లుప్తంగా

ఒలంపియాడ్‌లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న జయలేఖ

పాల్వంచ: శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయిలో నిర్వహించిన రామానుజన్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో పాల్వంచ స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ విద్యార్థిని గుమ్మళ్ల జయలేఖ రెండో ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.పుష్పలత తెలిపారు. సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లోక్ సత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా జయలేఖ బహుమతిని అందుకుందని తెలిపారు. ఉపాధ్యాయులు జి.భాస్కరరావు, జి.శ్రీనివాస రెడ్డి, స్వరూప, మౌనిక, సిబ్బంది జయలేఖను అభినందించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



గద్దెల వద్ద కమిటీ సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని చుంచుపల్లి మండలం రుద్రంపూర్, గౌతంపూర్లలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులు పరిశీలించారు. ఈ వేడుకలకు సింగరేణి సంస్థ లైటింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్, మంచినీటి సౌకర్యాన్ని కంపెనీ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రజాక్, గోపు కుమారస్వామి, రామచందర్‌రావు, రవీందర్, భిక్షపతి, గట్టయ్య, సమ్మయ్య, పి.కుమార్, సత్యనారాయణ, బాలాజీ, వెంకటేశ్వర్లు, భక్కులు, సింగరేణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులను కలిసిన రేషన్ డీలర్లు

టేకులపల్లి: మండలానికి చెందిన తహసీల్దార్, టేకులపల్లి, బోడు ఎస్సైలు బదిలీ అయ్యి కొత్త అధికారులు విధుల్లో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డీలర్లు తహసిల్దార్ నాగభవానీ, ఎస్సైలు షేక్ సైదా రహాఫ్, పి.శ్రీకాంత్‌లను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊకే శేఖర్ రావు, టేకులపల్లి మండలాధ్యక్షుడు ఆంగోతు సంతులాల్, జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర రామ, జీసీసీ డీలర్ దారావత్ తావుర్యానాయక్, డీలర్లు డి.సైదమ్మ, జి.కళ్యాణ్, గోపి, వెంకటేశ్, మాళోతు రాజేందర్‌నాయక్ పాల్గొన్నారు.


విద్యార్థులు ఒత్తిడిని జయించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరబాబు

సుజాతనగర్: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే సులువుగా పరీక్షలు రాయవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు జువ్వాది వెంకటేశ్వరబాబు అన్నారు. స్థానిక గరీబ్‌పేట హైస్కూల్‌లోని పదవతరగతి విద్యార్థులకు ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో మవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. జ్ఞాపకశక్తి చిట్కాలు, టైమ్ టేబుల్ ఎలా తయారుచేసుకోవాలి, పంచ సూత్రాలు, సబ్జెక్టుల వారీగా ఎలా సన్నద్ధం కావాలనే అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరుకుల వితరణ



సరుకులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

కొత్తగూడెంటౌన్: లక్ష్మీదేవిపల్లి మండలం హమాలీ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్‌గా కారింగుల రాజు ఇటీవల మృతిచెందగా శ్రీరాముల రాయమల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు శ్రీరాముల విశ్వనాథ్ మృతుడి ఇద్దరు కుమార్తెల చదువుకు అవసరమైన ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు లక్ష్మీ, స్వప్న, పిట్టల సంపత్, పులిగూజ సంపత్, పిట్టల శివ పాల్గొన్నారు.

పార్కులో ఫౌంటెన్, వాకింగ్ ట్రాక్







ఆహ్లాదం పంచేందుకు సిద్ధం

- నేడు పట్టణ లేక్ వ్యూ పార్క్ ప్రారంభం
- ఏళ్ల తర్వాత ప్రజల ముంగిటకు..
- రూ.1.75 కోట్లతో పునర్నిర్మాణం
- ప్రారంభించనున్న ఎమ్మెల్యే కోరం



లేక్ వ్యూ పార్క్

ఇల్లెందు: సిరులు కురిపించే సింగరేణి పుట్టినిల్లయిన ఇల్లెందు పట్టణంలో ఉన్న ఏకైక లేక్‌వ్యూ పార్క్ ఆహ్లాదాన్ని పంచేందుకు సిద్ధమైంది. రూ.1.75 కోట్లతో చేపట్టిన ఇల్లెందు లేక్ వ్యూ పార్క్ పునర్నిర్మించారు. అనేక అవాంతరాల నడుమ అన్ని పనులు పూర్తి చేసుకుని నేటి నుంచి ప్రజలకు ముంగిటకు రానుంది. పార్క్ సుందరీకరణ పనులు ముగించి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం, లైటింగ్ ఏర్పాటు చేశారు. పౌంటేన్, చిన్నారుల ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. పార్క్‌లో 60 రకాల వస్తువులు అందుబాటులో ఉంచారు.

పచ్చని సోయగం...

ఇక్కడికి వచ్చే వారు విశ్రాంతి పొందేందుకు ఇక్కడి పచ్చదనం, పూలమొక్కలు, రకరకాల చెట్లు, ఆట వస్తువులు, కూర్చుని విశ్రాంతి పొందేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. రాత్రుల్లో విద్యుద్దీపాలంకరణ, పచ్చని హరితవనం, సొగసుల సోయగం ఆహ్లాదభరితంగా మారింది. విద్యార్థులు రోజువారీ ఒత్తిడి, ఒడిదొడుకుల నుంచి ఆలంభన పొందేందుకు వారంలో ఒక రోజు ఆదివారం పూట ఈ పార్క్‌కు వచ్చి సెద తీరేలా ఏర్పాటు చేశారు.

అప్పటి నుంచి ఇప్పటికీ..

2007 అక్టోబర్ 21న అప్పటి కేంద్రమంత్రి రేణు కాచౌదరి ఈ పార్క్‌కు ప్రారంభోత్సవం చేశారు. సుమారు రూ.62 లక్షలు పార్క్ ఏర్పాటుకు ఖర్చు చేశారు. 2016లో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇల్లెందుల పాడు చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చాలని నిధులు సమీకరించారు. చెరువు పునరుద్ధరణ, చెరువు కట్టకు ఆనుకుని ఉన్న పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు రూ. 3.37 కోట్ల నిధులు మంజూరు చేశారు. రూ.1.75 కోట్లతో పార్క్, రూ. 1.62 కోట్లతో చెరువు అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగానే 8 ఏళ్లుగా సాగుతున్న లేక్ వ్యూ పార్క్ ఎట్టకేలకు ప్రజలకు ఆహ్లాదం పంచబోతోంది.

ప్రజల సందర్శన కోసమే.



పట్టణ ప్రజల అలసట తీర్చేందుకు ఆహ్లాదం పంచేందుకు ఎలాంటి అవకాశం లేని ఇల్లెందు పట్టణంలో లేక్ వ్యూ పార్క్, ఆ ప్రక్కనే మినీ ట్యాంక్ బండ్ ఎంతో ఉపయోగంగా మారనున్నాయి. తక్షణమే ప్రజల ముంగిటకు తెచ్చేందుకు కృషి సాగుతోంది. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఒకనాడు నిధులు సమీకరించగా, ఆయన చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉంది. ప్రజలంతా ఉపయోగించుకుంటూ దీన్ని కాపాడుకోవాలి

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, చైర్మన్, ఇల్లెందు మున్సిపాల్టీ

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాకేష్ కుమార్

జూలూరుపాడు: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్ కుమార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు పల్స్‌పోలియో, ఎన్‌డీడీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్చి 3న బూత్‌ల్లో పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్తి, సీహెచ్‌ఓవి వెంకటేశ్వర్లు, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మీ, నాగమణి, శంకుతల, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: ఛత్రపతి శివాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకునని ఆయన అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల్లో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ, అధ్యాపకులు లక్ష్మీ, రమణ కుమార్, మోహన్, నరేష్‌బాబు, శ్రీనివాస్, రాందాస్, అశోక్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్



మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ షీల్డు అందజేస్తున్న నిర్వాహకులు

టేకులపల్లి: కోరం కనకయ్య ప్రీమియర్ లీగ్ (మూడు నవీన్ మెమోరియల్) సీజన్ 1 క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. ఈ నెల 6న ప్రారంభమైన టోర్నమెంట్‌లో టేకులపల్లి మండలంలోని 36 పంచాయతీల నుంచి 40 జట్లు పోటీ పడ్డాయి. సోమవారం కేకే కేఎస్ఆర్ యూత్ – ఏజే 11 జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఏజే 11 జట్టు గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు తొలుత కేకే కేఎస్ఎస్ఆర్ యూత్ –తడికలపూడి ఏ జట్ల మధ్య సెమీఫైనల్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టుతో ఏజే11 జట్టు ఉదయం 10 గంటలకు ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. ఆ తరువాత ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు బహుమతి, షీల్డు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు బోడ మంగీలాల్ నాయక్, మూడు గణేష్ చౌహాన్, కత్తుల అఖిల్ తెలిపారు.

ఫిజియోథెరపీ కోర్సుతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న లక్ష్మణరావు

పాల్వంచ: ఫిజియోథెరపీ కోర్సుతో ఉజ్వల భవిష్యత్ ఉందని కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ఎల్.లక్ష్మణరావు అన్నారు. సోమవారం స్థానిక కేఎల్ఆర్ ఫిజియోథెరపీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్సు పూర్తయిన ప్రతీ ఒక్కరు మెడికల్ రంగంలో మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ కె.నాగమణి, డైరెక్టర్లు మురళీ ప్రసాద్, కాశీ విశ్వనాథం, ప్రిన్సిపాల్ డేవిడ్ సునీల్ రావు, నర్సింహారావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారిపై చర్య తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): డీఎంహెచ్‌ఓ శిరీష అక్రమాలపై విచారణ జరిపించి చర్య తీసుకోవాలని, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన కాంట్రాక్ట్ నియామకాల్లో అవినీతికి పాల్పడ్డారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో వర్క్ ఆర్డర్ డిప్యూటేషన్లను రద్దు చేసినప్పటికీ ఖమ్మం జిల్లా నుండి వచ్చిన డాక్టర్ శిరీషకు అర్హత లేనప్పటికీ డీఎంహెచ్‌ఓగా, భద్రాచలం అడిషనల్ డీఎంహెచ్‌ఓగా కొనసాగించడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కేశవనాయక్, మాదిగ చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ, నాయకులు తాండ్ర వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కురుమళ్ల శంకర్, బీఎస్పీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యెర్రా కామేష్, ఆదివాసీ జేఏసీ చైర్మన్ వాసం రామకృష్ణ, గోండ్వానా విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ ఇర్పా ప్రకాష్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కొమరం బుచ్చయ్య దొర, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రు నాయక్, జై ఆదివాసీ యువశక్తి జిల్లా అధ్యక్షుడు బొర్రా సురేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మెట్టల సైదుబాబు, ఫజల్‌భక్షి, మోహన్, కృష్ణ, దశరథ్, కుశల్, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని అనుమతి లేకుండా అక్రమంగా జరుగుతున్న ఇసుక రవాణాను అరికట్టాలని, నిబంధనలు ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇల్లెందు డీఎస్పీ ఎస్.చంద్రభాను అన్నారు. సోమవారం టేకులపల్లి, బోడు పోలీసు స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ల పరిసరాలు, సెల్, రిసెప్షన్, మౌలిక సదుపాయాలు తదితర వాటిని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో నేరాలను అదుపు చేయాలన్నారు. భూ తగాదాలు, సివిల్ తగాదాల విషయంలో జోక్యం చేసుకోవద్దని సూచించారు. యువత చెడు మార్గాల్లో పయనించకుండా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి, బోడు ఎస్సైలు షేక్ సైదా రహూఫ్, పి.శ్రీకాంత్, పోలీసు సిబ్బంది రమణ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాలే భవిష్యత్‌కు పునాది



ప్రశ్నాపత్రాలు ఆవిష్కరిస్తున్న చైర్మన్, తదితరులు

ఇల్లెందు: పదేళ్ల శ్రమకు పదిలో లభించే ఫలితాలే బంగారు భవిష్యత్‌కు పునాదిలాంటిదని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సింగరేణి హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా 800 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం డీవీ మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు విద్య పునాదిలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బయ్యా అభిమన్యు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ప్రవీణ్, నర్సింహారావు, సౌజన్య, సరళ, ఎస్ఎఫ్ఐ సభ్యులు కిషన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం



ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు సహజమని ఆర్‌సీహెచ్‌పీ ఎస్ఈ ఖరీముల్లా అన్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీహెచ్‌పీ నుంచి కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీపై వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.పవన్‌కుమార్, మహేష్‌కుమార్ పాండేలను ఫిట్ సెక్రటరీ ఎండి.గౌస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ... విధి నిర్వహణలో అంకితభావంతో, అధికారులు చెప్పి పని విధానాన్ని అమలు పరుస్తూ సంస్థ అభివృద్ధికి సహకరిస్తు, కార్మికులు సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ విశ్వేశ్వరరావు, ఐఎస్‌టీయూసీ ఇన్‌చార్జ్ ఎండి.గౌస్, గుర్రం రాజేశ్వరరావు, కొత్తురు శ్రీనివాస్, సుందర్, సమ్మయ్య, రవి, డీఎల్ఆర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో జరిగే విప్లవ పార్టీల జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం అన్నారుపాడు గ్రామంలో జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, పీసీసీ సీపీఐ(ఎంఎల్) మూడు పార్టీలు విలీనమై సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జాతీయ పార్టీగా ఆవిర్భవిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా, ధన్వంతరావు, సేవియ్యా, కైలా, సుజాత, సర్దార్, నరేష్, శ్రీను, వీరు, భీమా, చిన్నా, జగదీష్, వీరభద్రం, మధు, తావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మాస్‌లైన్ యూనిట్ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం కొమరారంలో ప్రచారం ప్రారంభించారు. గ్రామంలో వాల్‌రైటింగ్ రాయడంతోపాటు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మీర బిచ్చా, వాంకుడోత్ శంకర్, దేవ, కిరణ్, బుర్ర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె రహదారులకు నిధులు

- ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.1.90 కోట్లు మంజూరు
- పనుల ప్రారంభానికి అధికారుల సన్నాహాలు
- పూర్తయితే తీరనున్న ప్రజల ఇక్కట్లు



తిలక్‌నగర్‌లో అధ్వానంగా మారిన రహదారి

ఇల్లెందురూరల్: పల్లెలకు పలు పథకాల పేరుతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఇబ్బడిముబ్బడిగా నిధులు మంజూరవుతున్నాయి. అయినా నేటికీ పలు గ్రామాల్లో అడుగడుగునా గుంతలు.. తేలియాడుతున్న దుబ్బ, మొనలు తేలిన రాళ్లు.. వాటికితోడు చినుకు పడితే చాలు.. పల్లెల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా కనిపిస్తున్నాయి. కాలు తీసి కాలు వేయలేనంతగా బురదమయమవుతున్న రహదారులు కూడా అనేకం దర్శనమిస్తున్నాయి. తాజాగా మంజూరైన నిధులతో ఇలాంటి మరికొన్ని రహదారులకు మోక్షం కలుగుతుందని పల్లె వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.1.90 కోట్లు

ఎన్ఆర్ఈజీఎఫ్ పథకం ద్వారా గతంలో మంజూరైన నిధులను రెండు, మూడు గ్రామపంచాయతీలకే కేటాయించారనే విమర్శలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయంలో పలు వేదికల నుంచి తమ నిరసన వ్యక్తం చేశారు. కానీ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా మండలానికి రూ.1.90 కోట్లు మంజూరవగా వాటిని ప్రతీ పంచాయతీకి కనీసం రెండు నుంచి మూడు రహదారులు ఉండేలా ఎమ్మెల్యే కోరం కనకయ్య జాగ్రత్తలు తీసుకున్నారు. తాజాగా మంజూరైన నిధుల నుంచి సుభాష్‌నగర్‌కు రూ.45 లక్షలు, రేపల్లెవాడకు రూ.55 లక్షలు, బాలాజీనగర్‌కు రూ.15లక్షలు, ఒడ్డుగూడెంకు రూ.5 లక్షలు, చల్లసముద్రం, విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్, బోయితండా, ఇందిరానగర్, రాఘబోయినగూడెం గ్రామ పంచాయతీల్లో ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. ఒక్కో రహదారి రూ.5 లక్షలు చొప్పున మంజూరైన రూ.1.90 కోట్ల వ్యయంతో 38 రహదారులు నిర్మించనున్నారు. గతంలో కాకుండా తాజాగా మంజూరైన నిధులను కొత్త పాలకులు సగం గ్రామపంచాయతీలకైనా కేటాయించి తమను సంతృప్తి పర్చారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మార్చి నెలాఖరు గడువు..

తాజాగా మంజూరైన నిధులను మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలనే నిబంధన ఉంది. దీంతో పనులు ప్రారంభించేందుకు ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఏటా తక్కువ సమయం ఉండటంతో పనులు హడావుడిగా చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ కారణంగా పనులపై ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడుతుందనే ఆరోపణలున్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించక, కనీసం క్యూరింగ్ కూడా సక్రమంగా చేయకపోవడంతో సీసీ రహదారులు అనతికాలంలోనే పగుళ్లు బారుతున్నాయి. ఈసారి నెలన్నర గడువు ఉన్నందున ఆలోగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నాణ్యత పాటిస్తేనే ప్రయోజనం

గతంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా చేసిన రహదారులపై ప్రస్తుతం రాళ్లు తేలియాడుతున్నాయి. పనులు జరిగే సమయంలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సైతం పర్యవేక్షించి మిక్సింగ్, క్యూరింగ్ వంటి పనులు నిబంధనలకు లోబడి చేపట్టేలా పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ఇలాంటి నిధులు ఎన్ని మంజూరైనా తాత్కాలిక ఉపశమనంగానే మిగిలిపోతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



నడవడానికి కూడా వీలు లేని రహదారి

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాం



ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా మంజూరైన రూ.1.90 కోట్ల వ్యయంతో పనులు సకాలంలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పనుల గ్రౌండ్ వర్క్ ప్రారంభమయ్యాయి. ప్రతీ పనిలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటాం.

– రాజు, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, ఇల్లెందు